

భీమిని మండలం చిన్నతిమ్మాపూర్‌లో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

● మత్తడి దూకుతున్న నీల్వాయి ప్రాజెక్ట్..



మత్తడి దూకుతున్న నీల్వాయి ప్రాజెక్టు

వేమనపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకుతోంది. మత్త డిని బుధవారం ఎంపీడీవో కుమారస్వామి, నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలకు పలు గ్రామాల్లోని పత్తి, వరి పంటలు నీట మునిగాయి. రోడ్లపై వరదనీరు ప్రవహించి కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ముత్తాపూర్ నుంచి వేమనపల్లికి వెళ్లే రోడ్డుపై వరదనీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బెల్లంపల్లిలో రాంనగర్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న నీరు





నెన్నెల మండలం నందులపల్లిలో పత్తి చేనులో చేరిన నీరు

కుండపోత..

- జిల్లాలో దంచికొట్టిన వర్షం
- 10 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- కన్నెపల్లి మండలంలో అత్యధికం
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

మంచిర్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన భారీ వర్షం కారణంగా పలు మండలాల్లో రోడ్లు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. భారీ వర్షంతో పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా కన్నెపల్లి మండలం సాలిగాంలో ఇళ్లలోకి నీరు చేరింది. భీమిని మండలం ఖర్జీభీంపూర్ గ్రామంలో చెరువు మత్తడి తెగింది. ముంపు గ్రామాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రక్షణచర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో 24గంటలు అందుబాటులో ఉండే విధంగా 08736-250501 టోల్ ఫ్రీం నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కాగా భారీ వర్షం కారణంగా ప్రజ లు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 10.9 సెంమీ. సగటు వర్షపాతం నమోదైంది. గరిష్టంగా జిల్లాలోని కన్నెపల్లి మండలంలో 24.0 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇంతటి భారీ వర్షం కురియడం ఇదే తొలి సారి కావడం గమనార్హం.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద...

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని హాజీపూర్ మండలంలోగల ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చినీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట ఎత్తు 148మీటర్లకుగాను ప్రస్తుతం 145.64 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను 14.069 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 19,062 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్‌జిల్లా కడెం ప్రాజెక్టు మూడుగేట్లు తెరిచి 11,478క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. లోకల్ క్యాచ్ మెంట్ ద్వారా మరో 7,584 క్యూసెక్కులు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 451 క్యూ సెక్కులు ఉండగా హైద్రాబాద్ మెట్రోపాలి టన్ వర్క్ స్కీం కోసం 330 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెన్నెల(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షపాతం 120 మిల్లీమీటర్లుగా నమోదైంది. మండల కేంద్రం సమీపంలోని ఎర్రవాగు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాత్కాలిక వంతెన కొట్టుక పోవడంతో మన్నెగూడం, కర్జీ, కోనంపేట, లంబాడితండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరువులు, కుంటల్లో నీరు చేరింది. మత్తడి వాగు, కుమ్మరి వాగు ప్రాజెక్టులు అలుగు పారుతున్నాయి. కుమ్మరి వాగు చెరువు ఎడమ కాలువకు కొత్తగూడం వద్ద బుంగ పడటంతో మాజీ ఎంపీటీసీ హరీష్ గౌడ్ జేసీబీతో మరమ్మతు చేయిం చారు. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతంలో ఉన్న పత్తి చేలల్లో నీరు చేరింది. వరి పొలాలకు గండ్లు పడ్డాయి. కోనంపేట ఎస్సీ కాలనీలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో అక్కడి ప్రజలు రాత్రిపూట ఇక్కట్ల పాల య్యారు. అధికారులు మండలంలో పర్యటిం చి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. రేచిని గ్రామం నుంచి అన్నారం వెళ్లే దారిలో వాగులు ఉప్పొంగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాసిపేట నుంచి గ్రామం నుంచి గోపాల్‌నగర్‌కు వెళ్లే దారిలోని కల్వర్టు ధ్వంసంకావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పెగడపల్లి గ్రామంలోని చెరువు నిండుకుని మత్తడిపై పారుతుంది. దీంతో మత్తడి నుంచి భారీగా వరద నీరు పంట పొలాల్లోకి చేరడంతో వరి నారు కొట్టుకుపోయింది. గంపలపల్లిలో వరి పంట నీటిలో మునిగిపోయింది. అధికారులు సర్వే చేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. కురిసిన భారీ వర్షానికి చంద్రవెల్లి, తాండూర్, బోయపల్లి, రేపల్లె వాడలో పలు ఇళ్లు దెబ్బతిన్నాయని తహసీల్దార్ తెలిపారు. కస్తూర్బా పాఠశాల నుంచి రేచిని రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో భారీగా వర్షం నీరు చేరడంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బోయపల్లి గ్రామంలోని రహదారి పక్కన భారీగా వరద నీరు చేరడంతో ఎస్‌ఐ కిరణ్‌కుమార్, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి అక్కడకు చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో నీటిని తొలగించారు. మండలంలోని రైల్వే అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీరు చేరడంతో 15గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాండూర్‌లో మునిరాతి యాదగిరి అనే వ్యక్తి ఇల్లు వర్షానికి కూలిపోయింది.

బెల్లంపల్లి (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువార్డులతో పాటు రహదారులు జలమయ్యాయి. పట్టణంలోని రాంనగర్ బ్రిడ్జిపై నుంచి నీరు ఉధృ తంగా ప్రవహించడంతో కాలనీవాసుల రాక పోకలకు ఇబ్బందులు అయ్యాయి. అలాగే రైల్వేస్టేషన్ ఏరియా, బాబు క్యాంప్ బస్తీలో భారీ వర్షం కారణంగా వరద నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో ఇంటిలోని వస్తువులు నీటిలో మునిగాయి. దీంతో వాహనదారులతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాగులు, వాకలు పొంగి పొర్లాయి, చెరువులు, కుంటలు నిండు కుండలా కనిపిస్తున్నాయి. మదాపూర్,నర్సాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారిలో లో లెవల్ వంతెనపై వరద నీరు పొంగి పొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

కన్నెపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొత్తపల్లి గ్రామానికి వెళ్లే రహదారి జలమయంగా మారింది. అలాగే కన్నెపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీ వద్ద రోడ్డాం వల్ల రాకపోకలు స్తంభించిపోయాయి. ముత్తాపూర్ గ్రామంలో వర్షానికి మెయిన్ రోడ్డు నుంచి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది.

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు

భీమిని: మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో చిన్నతిమ్మాపూర్, వెంకటాపూర్, ఖర్జీభీంపూర్, భీమిని గ్రామాలతో పాటూ మండ లంలోని గ్రామాల్లో వాగులు పొంగి ప్రవహిం చాయి. చిన్న తిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో ఎర్రవాగు, నల్లవాగుల ప్రాతాంలో పాల్వాయి పురు షోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సుమారు 580 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఆయా వాగుల పరివాక ప్రాంతాల్లో ఉన్న పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వరద ఉధృతికి పంటలు కొట్టుకపోయాయి. చిన్న తిమ్మాపూర్ గ్రామంలో చాపిడి మెండి ఇంటి చుట్టూ వరదనీరు చేరింది. చిన్నతిమ్మాపూర్, హత్తిని గ్రామాల మధ్యలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా నీట మునిగింది. పెద్దపేట గ్రామంలో కూరగాయల తోటలు వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో పంటలు దెబ్బతిన్నాయి. వెంకటాపూర్, తంగళ్లపల్లి గ్రామాల మధ్య వాగులో ట్రాక్టరు, బెలేరో వాహనం వరద నీటిలో చిక్కుకున్నాయి. అనంతరం రైతులు వాటిని బయటకు తీశారు. ఖర్జీ భీంపూర్ గ్రామంలో కొత్త చెరువు కింద సుమారు 200 ఎకరాల్లో వరి పంటలను రైతులు సాగు చేస్తుంటారు. మంగళవారం కురిన భారీ వర్షాలకు మత్తడికి గండి పడి చెరువు నీరు వృథాగా పోతోంది. చెరువుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా..	
సగటు వర్షపాతం 10.9 సెంటీమీటర్లు	
కన్నెపల్లి	24 సెం.మీ.
భీమిని	23.8 సెం.మీ.
తాండూరు	17.4 సెం.మీ.
బెల్లంపల్లి	16.5 సెం.మీ.
నెన్నెల	12.8 సెం.మీ.
వేమనపల్లి	12.5 సెం.మీ.
కోటపల్లి	10.8 సెం.మీ.
కాసిపేట	7.6 సెం.మీ.
హాజీపూర్	6.9 సెం.మీ.
మంచిర్యాల	6.8 సెం.మీ.
లక్షెట్టిపేట	6.5 సెం.మీ.

వాగుదాటలేక గర్భిణి ఇబ్బందులు



గర్భిణిని వాగు దాటిస్తున్న పోలీసులు

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఏజెన్సీ గ్రామాలకు ప్రధాన రహదారులకు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దొడ్డిగూడెంకు చెందిన కొడప యమున అనే గర్భిణికి బుధవారం తెల్లవారుజామున పురుటినొప్పులు మొదలయ్యాయి. మండల కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాలంటే సుమారు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెళ్లాలి. అక్కడకు చేరుకోవాలంటే నర్సాపూర్ మార్గమధ్యంలో ఉన్న వాగు దాటివెళ్లాలి. గర్భిణికి అత్యవసర వైద్యం అవసరం కావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా అంబులెన్స్ ఉదయం ఐదు గంటలకు వాగు వద్దకు వచ్చింది. కానీ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో అంబులెన్స్ వాగు దాటలేదు. ఉదయం ఎనిమిది గంటల వరకు వరద ఉధృతి తగ్గకపోవడంతో గ్రామస్థులు మాదారం ఎస్‌ఐ సౌజన్యకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ వాగు వద్దకు చేరుకుని తాండూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్, గ్రామస్థుల సహాయంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో నుంచి తాళ్ల సహాయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. దీంతో పోలీసులను స్థానికులు అభినందించారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



తాండూర్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా చేరిన నీరు



పొంగిపొర్లుతున్న ముత్యంపేట వాగు



నెన్నెల శివారులో నీట మునిగిన వరి పొలాలు

నెన్నెల తహసీల్దార్‌గా శ్రీనివాస్

నెన్నెల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నెన్నెల తహసీల్దార్‌గా పి. శ్రీనివాస్ నియమితులయ్యారు. మంచిర్యాల కలెక్టరెట్‌లో సుపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను తహసిల్దార్‌గా నియమిస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి తహసిల్దార్ జ్యోతి ప్రియదర్శిని ఈ నెల 5న గుండెపోటుతో మృతి చెందారు. అప్పటి నుంచి డిప్యూటీ తహసిల్దార్ ప్రకాష్ ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు.

వంతెన ఏర్పాటు చేయండి

తాండూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ రహదారికి నూతన వంతెన ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్‌కు మాజీ సర్పంచు బాపురావు వినతిపత్రం అందించారు. నర్సాపూర్ రహదారిపై నిర్మించిన కల్వర్టు 30 నుంచి 32సంవత్సరాలు అవుతుందని దీంతో కృంగిపోయిందన్నారు. వెంటనే నూతన వంతెన నిర్మించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

భీమారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గొల్లకుర్మల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కు గొల్లకుర్మల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ వినతి పత్రం అందించారు. బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని, గొల్లకుర్మలకు 80 శాతం సబ్సిడీతో లోన్లు అందజేయాలని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ కుమార్ దీపక్

భీమిని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు జలమయమైన చిన్నతిమ్మాపూర్, ఖర్జీభీంపూర్ గ్రామాల్లో ఆయన బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కలిసి సందర్శించారు. ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలు చేపడతారని భరోసా ఇచ్చారు. రైతుల పంట పొలాలో విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు, చెరువుల వద్దకు ప్రజలు ఎవ్వరూ వెళ్లవద్దన్నారు. అత్యవసరం ఐతేనే బయటకు రావాలని సూచించారు. చిన్నతిమ్మాపూర్‌లో ఎర్రవాగు, నల్లవాగు బ్యాక్ వాటర్‌లో మునిగిన పంటలను పరిశీలించారు. పెద్దపేట, రాజారం గ్రామాల మధ్యలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును, ఖర్జీభీంపూర్ గ్రామంలో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్డు, వంతెనను పరిశీలించి వెంటనే యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పెద్దపేట గ్రామంలో మునిగిన పంటలను సబ్ కలెక్టర్ మనోజ్, ఏడీఏ సురేఖ పరిశీలించి రైతులు అధైర్యపడవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బికర్ణదాస్, ఎంపీడీవో గంగామోహన్, ఎస్సై విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి..

కన్నెపల్లి (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం అప్రమత్తత చర్యలు చేపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కన్నెపల్లి మండలంలోని సాలిగాం గ్రామంలోని పాల్వాయి పురుషోత్తం రావు ప్రాజెక్టును బ్యాక్ వాటర్ పరిస్థితిని పరిశీలించి ప్రమాద స్థాయిలో ఉన్న ఇళ్ల ప్రజలను పునరావాసంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాక్ వాటర్‌కు ముంపునకు గురవుతున్న ఇళ్ల యజమానులు అధైర్య పడవద్దని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను నిర్వహించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఫాగింగ్‌చేయాలని అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులందరు అందుబాటులో ఉండాలని అవసరమైన ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎవైనా సంఘటనలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

● **సబ్ కలెక్టర్ పర్యటన..**

కన్నెపల్లి మండలంలోని సాలిగాం గ్రామంలో బుధవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పర్యటించారు. పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల ఇండ్లలోకి నీరు చేరగా ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీని వాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాలిగాం గ్రామంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



సాలిగాం గ్రామంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

గంజాయి పట్టివేత

ముగ్గురిపై కేసు

నెన్నెల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నిషేధిత గంజాయి సేవిస్తున్న యువకులపై దాడి చేసి నెన్నెల పోలీసులు బుధవారం ఒకరిని పట్టుకున్నారు. అతడి నుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు బొప్పారం అడవిలో గంజాయి సేవిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాడి చేయగా ముగ్గురిలో ఇద్దరు పారిపోయారు. మంచిర్యాల గద్దెరేగడికి చెందిన ఐటీఐ విద్యార్థి పాల్తెపు ప్రణయ్(22) దొరికిపోయాడు. అతడిని సోదా చేయగా 1.50 గ్రాముల గంజాయి లభించింది. అతడి నుంచి గంజాయితో పాటు ఒక ద్విచక్రవాహనం (టీఎస్ 19హెచ్ 5342), సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. పట్టుబడిన ప్రణయ్‌తో పాటు పారిపోయిన నెన్నెల మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పోతురాజుల ఆకాష్, గొళ్లపల్లికి చెందిన సల్లూరి పేత్రులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

సర్వేలు పూర్తి

- నిధుల కోసం నిరీక్షణ..
- అమృత్ భారత్ 2.0 పథకం అమలుతో పట్టణాభివృద్ధి

కాగజ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో అమృత్ భారత్ 2.0 పథకంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల సర్వే పూర్తయింది. కానీ ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ 2.0 పథకంలో ఎంపిక చేసింది. ఈ ప్రక్రియ కోసం రూ.25 కోట్ల నిధులు విడుదల చేయనుంది. ఈ ఏడది జనవరి 22న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అధికారికంగా 30 వార్డుల్లో డ్రోన్ సర్వేను ప్రారంభించారు.

తాగునీటి సరఫరా..

పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుపరుచడం, తగినంత నీటి లభ్యతను నిర్ధారిం చడం ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మురుగునీటి నిర్వహణను మెరుగుపరుచనున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం ఈ పథకం ద్వారా చేయనున్నారు. ఈ సర్వేలో వార్డులోని అంతర్గత రోడ్లు..? ప్రధాన కూడళ్ల స్థితిగతులపై సర్వేలు చేశారు. అలాగే ఈ సర్వేలకు సంబంధించి మ్యాప్‌లను కూడా రూపొందించారు. సర్వే ఆఫ్ ఇండియా బృందం సభ్యులు, కాగజ్‌నగర్ పురపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ సర్వేల్లో ప్రధానంగా ఎనిమిది కూడళ్లగా విభజించారు. భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేశారు. వార్డుల వారీగా ప్రత్యేక నాళాలు రూపొందించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు.

ప్రస్తు తం నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈ నిధులు వస్తే పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందికర పరిస్థితులో కాలం వెళ్లదీస్తున్నారు. చిన్నపాటి వర్షానికే మార్కెట్ ఏరియా, సంజీవయ్య కాలనీతో పాటు పలు కాలనీల్లోని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. వర్షం కురిసిందంటే చాలు లోతట్టు వాసులు బిక్కు మంటు కాలం గడుపుతున్నారు. అమృత్ భారత్ 2,0 స్కీం కోసం సర్వేలు పూర్తి అయ్యాయి. నిధులు విడుదల జరిగితే ఈ సమస్యలకు చెక్ పెట్టే అవకాశాలున్నాయని ఆయా కాలనీ వాసులు చెబుతున్నారు. దీంతో పాటు పట్టణంలని పలు కాలనీల్లో చిన్న పాటి వర్షానికే బురద మయంగా మారుతున్నాయిని చెబుతున్నారు.

14వ వార్డు కాలనీ, ఆదర్శనగర్ కాలనీలో వర్షం నీరు అధికంగా ప్రవహిస్తోంది. పక్కాగా మాస్టార్ ప్లాన్ అమలు చేస్తే బాగుంటుందని ఆయా కాలనీ మహిళలు కోరుతున్నారు. అంతర్గత రోడ్ల విస్తరణ ప్రధాన కూడళ్ల రద్దీగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య రోజుకు రోజుకు పేరుక పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయావార్డుల ప్రజల కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా అమృత్ భారత్ 2.0 స్కీంలో సర్వేలు పూర్తి చేశామని చెప్పారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.



అమృత్ భారత్ 2.0 పథకంలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే(ఫైల్)

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కాసిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం ఇందిరమ్మ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ ఎండీ రంజాన్(41) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక బుధవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రంజాన్ కొన్నిరోజుల క్రితం లారీని కొనుగోలు చేశాడు. దీంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 12న శ్రీరాంపూర్ వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం కేసు పెడుతుందని భయపడ్డాడు. ఇదివరకు అప్పులు ఉండడం, కేసు వేస్తే మరిన్ని అప్పుల పాలవుతానని భయపడి ఇంట్లో ఎవరు లేని సమయంలో బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రంజాన్ కొడుకు అసన్‌బాబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గూడ్స్ రైలు ఢీ కొని యువకుడి మృతి

సిర్పూర్(టి), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన జంషీద్ అహ్మద్(35) అనే యువవకుడు మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు వెనక నుంచి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జంషీద్ అహ్మద్ రైల్వే స్టేషన్‌లో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాత్రి పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది ఒకరు రాక పోవడంతో జంషీద్‌ను పెట్రోలింగ్‌కు పంపిం చారు. ఇంతలోనే రాత్రి భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో గూడ్స్ రైలు కాగజ్‌నగర్ వైపు కు వెళ్త తిరిగి వెనక వైపు రాగా ప్రమాదవ శాత్తు జంషీద్‌ను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు మరో రైల్వే ఉద్యోగి ప్రవీణ్‌కు చేయి విరిగింది. రైల్వే సిబ్బంది సమాచారం అందించగా మృతదేహాన్ని సిర్పూర్(టి) ఆసుపత్రికి తరలించి పోర్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా రైల్వే సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబీకులు మృతదేహంతో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం అందజేస్తామని కాం ట్రాక్టర్ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

జనజీవనానికి ఇబ్బందులు రానీయం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జనజీవనానికి ఇబ్బందులు రానీయకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపల్లి వాగును జిల్లా ఎస్పీ కాంతిలాల్ సుభాష్‌తో కలిసి బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరం యితేనే బయటకు రావాలని, వాగులు, నదులు దాటే ప్రయత్నం చేయకూడదని చెప్పారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు భారీ వర్షాలు కురిసే సమయంలో చేనులలో, అడవులకు వెళ్లకకూడదని సూచించారు. జిల్లాలో గత రాత్రి కురిసన భారీ వర్షం కారణంగా వాగులు,ం ఒర్రెలు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రవహిస్తున్నాయని అన్నారు. అధికారులు రక్షణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వంతెనలు, వాగులు, కాజ్‌వేల వద్ద బందో బస్తు ఏర్పాటు చేసి ప్రజలు అటువైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, సీఐ బాలాజీ వర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని నివాస ప్రాంతాల్లో ఎక్కడ మురుగునీరు నిల్లకుండా చర్యలు చేపడుతామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుదవారం జిల్లాలోని ఆసిఫాబాద్ పటట్టంలోని పైకాజీనగర్‌లోని మురుగు నీటి వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రాత్రి కురిసిన వర్షానికి పట్టంలోని మురుగు కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో చేరిన మురుగు నీటిని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలనీలో శాశ్వత ముఉగు కాలువలను నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే మూడు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజలకు తాగునీటిని అందించాలని తెలిపారు. క్లోరినేషన్ పనులు, బ్లీచింగ్ పాగింగ్, అయిల్ బాల్స్ పిచికారీ సకాలంలో చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గజానన్, తదితరులు ఉన్నారు.



తుంపల్లి వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బాలుడిపై లైంగిక దాడి

నిందితుడికి యావజ్జీవ కారగార శిక్ష

రూ. 10వేలు జరిమానా

మంచిర్యాల క్రైం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన ఉత్తరప్రదేశ్ చెందిన బబ్లుకు యావజ్జీవ కారాగార శిక్షను జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ బుధవారం తీర్పురిచ్చినట్లు ఏసీపీ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ అనే చిరు వ్యాపారి మంచిర్యాల జిల్లా కేంద్రానికి వలస వచ్చి ఐస్ క్రీమ్‌లు అమ్మి జీవిస్తుంటాడు. 2018 ఫిబ్రవరి 24వ తేదీన జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలుడిని ఐస్ క్రీములు ఇస్తానని నమ్మబలికి మంచిర్యాలలోని శాలివాహన పవర్ ప్లాంట్‌లోని చెట్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలుడు బబ్లూ దగ్గరినుంచి తప్పించుకుని పారిపోయాడు. స్థానికులు గుర్తించి బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగించారు. 2018 ఫిబ్రవరి 25 కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బబ్లూపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో అప్పటి విచారణ అధికారులు ఏసీపీలు గౌస్ బాబా, సీతారాములు, అప్పటి ఎస్సై శ్రీనివాస్ చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా స్పెషల్ పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ రాంబో, కోర్టు లైనన్ ఆఫీసర్ గోవింద్‌రావు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి, సరైన సాక్ష్యదారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువుకావడంతో బబ్లూకు జీవిత ఖైదుతో పాటు 10వేల రూపాయల జరిమానా, బాధిత కుటుంబానికి మూడు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీస్ అధికారులను, ఏసీపీలు ప్రకాష్, గౌస్‌బాబా, సీతారాములు, సీఐ ప్రమోద్‌రావు, అప్పటి ఎస్సై శ్రీనివాస్, కోర్టు సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడి మృతి

జైనూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడామామడ గ్రామానికి చెందిన సయ్యద్ అబ్బాస్(68) అనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుధవారం అనారోగ్యం తో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణక్క పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, నాయకులు షేక్ హుస్సేన్, షేక్ యుసుఫ్, సయ్యద్ సలీం, గేడాం గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

'ఓరియంట్'లో మోగిన ఎన్నికల నగారా

19న గుర్తింపు సంఘం ఎన్నికలు

కాసిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ (అదాని) కంపెనీలో ఎట్టకేలకు ఎన్నికల నగారా మోగింది. దీంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బుధవారం ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 19న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నారు. 266 మంది ఓటర్లు (కార్మికులు) ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఐదు కార్మిక సంఘాలు బరిలో నిలిచేందుకు అర్హత సాధించినట్లు తెలిపారు. 229 మంది వేజ్‌బోర్డు కార్మికులు కాగా 37 మంది వేజ్‌బోర్డు సిబ్బంది ఉన్నారు. ఎన్నికల ఫలితాలను మరుసటి రోజు 20న ఫలితాలను హైకోర్టుకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.

తొమ్మిది మందికి ఓటు హక్కు కల్పించలేదు

ఇటీవల జరిగిన డీసీఎల్ సమావేశంలో 9 మంది ట్రైనీ కార్మికులకు డిసీఎల్ అధికారులు ఓటరు లిస్టులో పేర్లను చేర్చారు. కానీ కొన్ని సంఘాలు అభ్యంతరం తెలపడంతో 9 మంది కార్మికులను చివరి జాబితాలో ఓటరు లిస్టులో నుంచి తొలగించారు. దీంతో ఈ 9 మంది బుధవారం ఆందోలనకు దిగారు. మేము సైతం కోర్టును ఆశ్రయిస్తామని చెప్పడంతో కార్మిక సంఘాల్లో ఆందోళన మొదలైంది.

జన్నారం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



జెండా ఊపి భారీ వాహనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని తపాలాపూర్ చెకిపోస్టు వద్ద ఎమ్మెల్యేతో పాటు మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిశ్ సింగ్ జెండా ఊపి భారీ వాహనాలను ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన మాట్లాడారు. జన్నారం, ఉట్నూరు మండలా లు పూర్తిగా టైగర్ జోన్ ఆంక్షల వలలో ఉన్నాయని, ఆంక్షలు ఎత్తివేసేందుకు ఆదివాసీ నాయకుడిగా ఉన్న నాటి నుంచే కృషి చేస్తున్నానని, ఈ రోజు భారీ వాహనాల ఆంక్షల నిషేదం ఎత్తివేతలో విజయం సాధిం చానని ఖానాపూర్ నియోజకవర్గంలో ఆదివా సీలు అటవీ ఆంక్షల వల్ల ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎమ్మెల్యే అయినప్పటి నుంచి అటవీ వైల్డ్ లైఫ్ సభ్యుడుని కావడంతో ప్రతీ సమావేశంలో ఆంక్షల ఎత్తివేతపై మాట్లాడా నని వివరించారు. ముఖ్యంగా భారీ వాహనాల రాకపోకలపై నిషేదం ఉండడంతో జన్నారం, నిర్మల్ జిల్లాలోని కడెం, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు మండలాలు అభివృద్ధిలో వెనుకపడ్డా యని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయానని తెలిపారు. ముఖ్యంగా జన్నారం మండలం పూర్తిస్థాయిలో వెనకబడిపోయిందని, అధికారంలో ఉండి ఆంక్షల ఎత్తివేతకు చేసిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నానని, రానున్న మూడేళ్లలో రూపురేఖలు మారుస్తామని వివరించారు. కార్యక్రమంలో ముజఫర్ అలీ, సయ్యద్ ఫసీఉల్లా, సయ్యద్ ఇసాక్, మేకల మాణిక్యం, తుమ్మల రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులకు చేసింది శూన్యం

జైపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను ఐఎన్‌టీయూసీ చేసింది శూన్యమని, ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల గురించి మాట్లాడే అర్హత ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్‌కు లేదని హెచ్‌ఎంఎస్ ఎస్టీపీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ విక్రమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్‌లోని ఎస్టీపీపీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై హెచ్‌ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్ యాజమాన్యంకు ఎన్నోసార్లు వివరించారని పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్ ప్రసాద్ మండల కేంద్రంలో నివాసం ఉంటూ కార్మికులు పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం జాగృతి, హెచ్‌ఎంఎస్ ఐక్య పోరాటాలు చేయడానికి నిర్ణయం తీసుకున్నదని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఓ టు జీఎం ఎన్ సత్యనారాయణ అన్నారు. యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా జీఎం కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, డీజీఎం(సివిల్) ఆనంద్‌కుమార్, పర్చేజ్ అధికారి నర్సింగరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఫైనాన్స్ అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించాలి



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న జీఎం దేవేందర్

కాసిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కంపెనీ నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలంటే కార్మికులు, అధికారులందరు సమష్టిగా పనిచేయాలని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. కాసిపేట 1వ గని ఆవరణలో బుధవారం నిర్వహించిన మల్టీ డిపార్టుమెంట్ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో కార్మికులు ఉత్సాహంగా పాల్గొని ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తేనే గనులకు భవిష్యత్ ఉంటుందన్నారు. అదనపు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. యాజమాన్యం కార్మికుల సంక్షే మానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉత్తమ సలహాలు, సూచనలు చేసిన కార్మికులను అభినందించిన మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, అధికారులు రమేష్, రాంబాబు, బాలాజీ బగవతి, ప్రసాద్, శ్యాంసుందర్, సతీష్, మీర్జాగౌస్, నిఖిల్, పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆంజనేయులు

మందమర్రిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏరియాలోని కేకే ఓసీపీలో పని చేస్తున్న ఆర్నకొండ ఆంజనేయులు నియమితులయ్యారు. బుధవారం మందమర్రి యూనియన్ కార్యాలయంలో యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ నియామక పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ అభివృ ద్ధికి పాటు పడుతున్న ఆంజనేయులు సేవలను దృష్టిలో ఉంచుకుని ఈ పదవీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నాయకులు కృషి చేయాలన్నారు. ఈ పదవీ రావడానికి కృ షి చేసిన కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్ యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపా. ధ్యక్షుడు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి పాటుపడుతామని తెలిపారు.

ఏరియా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

శ్రీరాంపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ ఉద్యోగులను సింగరేణి అధికారులు ఎంపిక చేశారు. వీరిని ఆగస్టు 15న ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ సన్మానించనున్నారు. కంపెనీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగిగా ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనికి చెందిన ఫోర్‌మెన్ ఎ మధుసూదన్ రావు ఎంపికయ్యారు. ఆయన కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సీఎండీ ఎన్ బలరాం చేతులమీదుగా సన్మానం అందుకోనున్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 5 గని నుంచి మధుకర్, ప్రవీణ్, ఆర్‌కే 6 గని నుంచి రమేష్ కుమార్, రాజయ్య, ఆర్‌కే 7 గని నుంచి శ్రీనివాస్, వెంకటి, ఆర్‌కే న్యూటెక్ గని నుంచి దీక్షిత్, వెంకటేశ్వర్లు, ఎస్ఆర్‌పీ 1 గని నుంచి నారాయణ రెడ్డి, మధుకర్, ఎస్ఆర్‌పీ 3, 3ఏ గని నుంచి బాబురావు, శ్రీనివాస్, ఐకే 1ఏ నుంచి లక్ష్మయ్య, తిరుపతి, ఐకే ఓసీపీ నుంచి వెంకటేష్, రమేష్, ఎఆర్‌పీ ఓసీపీ నుంచి శ్రీనివాస్, రాజయ్య, ఎస్ఆర్‌పీ సీహెచ్‌పీ నుంచి శ్రీనివాస రావు ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలో ఉన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా ఉత్తమ ఉద్యోగులను యాజమాన్యం ఎంపిక చేసింది. ఈమేరకు ఎంపికైన ఉద్యోగుల వివరాలను పీఎం శ్యాం సుందర్ బుధవారం వెల్లడించారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్ల నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేశామని తెలిపారు. ఉత్తమ సింగరేణియేన్‌గా కొలవేని అంకులు కోల్ కట్టర్ కాసిపేట 1వ గని, ఉత్తమ ఉద్యోగికి ఇస్మాయిల్ జనరల్ అసిస్టెంట్, బి. శ్రీనివాస్ హెడ్ ఓవర్ మెన్ శాంతి ఖని, బియ్యాల వెంకటేశం టిండాల్, కాసిపేట 1వ గని, నాగేశ్వర్‌రావు సీనియర్ మైనింగ్ సర్దార్, కాసిపేట 1వ గని, ఉదయ్‌మోహన్, కాసిపేట 2, తిరుపతి , జనరల్ అసిస్టెంట్ కాసిపేట 2, మల్లేష్ కోల్ కట్టర్ కేకే 5, సత్యనారాయణ ఎస్‌డీఎల్ ఆపరేటర్ కేకే 5, ప్రకాష్ ఈపీ ఆపరేటర్ కేకే ఓసీపీ, సురేష్ ఎలక్ట్రిషియన్ కేకే ఓసీపీ, శ్రీనివాస్ వెల్డర్, ఆర్కే సీఎస్పీలు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని స్వాతంత్ర్యదినోత్సం రోజున సింగరేణి పాఠశాల మైదానంలో సన్మానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎంపికైన ఉద్యోగులు సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించే కార్యక్రమానికి ఉదయం 8 గంటలలోగా హాజరు కావాలని పీఎం శ్యాం సుందర్ కోరారు. స్వాతంత్ర్యదినోత్సం కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

కడెం ప్రధాన కాలువలో పడి కూలీ మృతి

దండేపల్లి ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రాజుగూడ పంచాయతీ పరిధి కుంటలగూడ కట్ట గ్రామ సమీ౼ంలోగల కడెం ప్రధాన కాలువలో ప్రమాదశాత్తు పడి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సాదం నరసయ్య(48) అనే కూలీ మృతి చెందాడు. దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ చెందిన నరసయ్య బతుకుదెరువు కోసం కొంత కాలంగా జన్నారం మండలం తిమ్మాపూర్‌లో అతని పెద్దమ్మ బొబ్బిలి సత్తవ్వ ఇంటి వద్ద నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం కూలీ పని కోసం దండేపల్లి మండలం కుంటల గూడ కట్ట వెళ్లాడు. మద్యం మత్తులో కడెం ప్రధాన కాలువ పక్కనచెట్టు కింద కూర్చోని ఉన్నాడు. అతనితో వచ్చి తోటి కూలీలు వ్యవసాయ పనులో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నా సమయంలో చెట్టు కింద కూర్చొని ఉన్న నరసయ్య కనిపించలే దు. అతని కోసం చుట్టుపక్కల, కడెం కాలువలో వెతికి నా కనిపించలేదు. దీంతో అతడి బంధు వులు దండేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యా దు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. మద్యం మత్తులో కడెం కాలువలో పడి నీటి ప్రవాహానికి కొంత దూరం కొట్టుకుపోయాడు. బుధవారం ఉదయం కొంత దూరంలో అతని మృతదేహం కడెం కాలువలో కనిపించడంతో అటువైపు వెళ్తున్న రైతు గమనించి వారి బంధువులకు సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి బంధువు మారి నేని భూమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తైసినోద్దీన్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
14 ఆగస్టు 2025



"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు..' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.



ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్ల

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్ల

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతులమీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్ళారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలావ్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్నిసామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్ల

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

సంక్షిప్త సమాచారం

మందమర్రిరూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలని, కార్పొరేట్‌లు భారత వ్యవసాయ రంగాన్ని విడిచి పెట్టాలని కోరుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏఐకేఎంఎస్ నాయకులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను బుధవారం దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసుకుని ఇంటర్ చదువుతున్న లాస్య, మౌనిక, పూజ, అశ్రితలకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఉపకార వేతనాలను కలెక్టర్ కుమార్ దీపక్, సంస్థ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ అందించారు.

● కవ్వాల్ అభయారణ్యంలోనా పాలగేరి గూడెంను ఫారెస్టు అధికారులు ధ్వంసం చేయగా బుధవారం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజన్ సందర్శించారు. ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మంచిర్యాల పట్టణాధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ బుధవారం తన నివాసంపై జాతీయ జెండాను ఎగురవేశారు.

జన్నారం: ఈ నెల 20వ తేదీ నుంచి 22 తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహిచే సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖలీందర్ ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లు విడుదల చేశారు.

దండేపల్లి: మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన కంటెం మౌనికకు వైద్య ఖర్చుల కోసం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అండగా నిలిచారు. మూడు నెలల క్రితం మౌనిక అనారోగ్యంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చుల కోసం రూ 2లక్ష 25వేల ఎల్‌వోసీ చెక్కు అందజేశారు. మాజీ జెడ్పీ సభ్యురాలు గడ్డం నాగరాణి, కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్ జన్మదినం సందర్భంగా శ్రీరాంపూర్‌లోని సాయి దృష్టి అంధుల వృద్ధాశ్రమంలోని బాలబాలికలు, వృద్ధుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు.

మందమర్రిటౌన్: మందమర్రిలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో నాయకులు సమ్మయ్య, ఆంజనేయు లు, భూమయ్య నరేందర్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను తగ్గించిందే బీఆర్ఎస్

- మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లను తగ్గించింది బీఆర్ఎస్ అని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తుంటే బీఆర్ఎస్ బీసీ రాగం అందుకోవడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి విమర్శించారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ పార్టీ బీసీల కోసం ఏం చేసిందో జవాబు చెప్పాల న్నారు. బీసీలు రాజకీయంగా ఎదిగితే తాము ఎక్కడ దెబ్బతింటామోనని ఆశిసె ఎత్తలేదన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. అనంతరం ఆర్డినెన్స్ జారీ చేసి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపామని వివరించారు. మూడు నెలల్లోగా ఆమోదించకపోతే సుప్రీంకోర్టు తీర్పుప్రకారం చట్టం అవుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● యూరియా కొరత లేదు

రాష్ట్రంలో రైతన్నలు యూరియా కోసం ఆందోళన చెందవద్దని, జిల్లాలో రైతులకు యూరియా అందేలా చూడాలని కలెక్టర్‌తో మాట్లాడానని మంత్రి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. రాష్ట్రానికి యూరియా అందించడంలో కేంద్రం సరిగ్గా స్పందించడం లేదన్నారు. రైతులకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కావాలని కొందరు తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నార న్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉపాధి కల్పన, కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్‌వెంకటస్వామి అన్నారు. మందమర్రి పట్టణంలోని కార్మెల్ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి అతిథిగా హాజరై కళాశాలను ప్రారంభించారు. అంతకుముందు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పది వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్మెల్ పాఠశాల నిర్వహకులు విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు గొప్పవన్నారు. మంత్రిని నిర్వహకులు ఘనంగా సన్మా నించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు జేవీఆర్ రెక్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

కాసిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కాసిపేట మెడికల్ ఆఫీసర్ శ్రీదివ్య అన్నారు. బుధవారం కాసిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రధానమంత్రి టీబీముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీబీ వ్యాధి చాలా ప్రమాదకరమన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతీఒక్కరు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా పరిగణించాలన్నారు. శిబిరంలో 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 53 మందికి టీబీ అనుమానిత లక్షణాలు కనబడడంతో ఎక్స్‌రే కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశామని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ పద్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు హరీష్, ప్రవీణ్, సూపర్‌వైజర్‌లు ఆకాంక్ష, సరోజ, ఏఎన్ఎంలు రజనీకుమారి, జ్యోతి, సుజాత, రమాదేవి, సునీత, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్ఎఫ్(నవతరం స్టూడెంట్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు, విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస ప్రభుత్వం విద్యార్థులను, విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా మోసం చేసిందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెడితే అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

భీమిని, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు తగు జాగ్రత్తలు అందించాలన్నారు. ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి నిలిపిందని, దవాఖానాల్లో సౌకర్యాలు కల్పిచడంతో పాటు సేవలను విస్తృత పరుస్తున్నట్లు తెలిపారు. విధుల్లో సమయపాలన పాటించాలని, విధులకు సక్రమంగా హాజరై, సిబ్బంది విధులకు సమయపాలన పాటించాలని, ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరగాలని, గ్రామాల్లో సబ్ సెంటర్లను విధిగా ప్రతీ రోజూ తెరవాలని, చక్కటి ప్రణాళికలతో గ్రామీణులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి ఫిజియోథెరపీపై ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి ప్రసాద్, వైద్యులు అనిల్ కుమా ర్, సీహెచ్‌వోలు పుట్ట సత్తయ్య, జలపతి, హెచ్ఈవో శ్రీనివాస్, హెచ్‌వీ ఇందిర, హెచ్ఏలు ఉమాశంకర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

ప్రాజెక్టును సందర్శించిన సబ్ కలెక్టర్

వేమనపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి ప్రాజెక్టును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం వివరాలను, ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సాయికృష్ణ, ఆర్ఐ కలీల్ ఉన్నారు.

గుడుంబా పట్టివేత

కన్నెపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తాపూర్‌లో బుధవారం పది లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. మోటార్ సైకిల్‌పై గుడుంబా తరలిస్తుండగా దరావత్ రవీందర్ పట్టుకున్నామన్నామని తెలిపారు.

అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలి

కోటపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 108, 102 అంబులెన్స్‌ల సేవలను వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా వాహనాల ప్రోగ్రాం అధికారి స్వామిట్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనం పనితీరును పరిశీలించారు. వాహనంలో ఉన్న వైద్య పరికరాలు, అత్యవసర సమయంలో వినియోగించే మెడికల్ పరికరాలను, మందులను పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. 108 అంబులెన్స్ వాహనాల జిల్లా కార్యానిర్వహణ అధికారి సంపత్, కోటపల్లి, వేమనపల్లి వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండిపోయాయని రైతులు స్వల్పకాలిక రకాలైన పంటలను ఎంచుకోవాలని ఏఈవో ముత్యం తిరుపతి సూచించారు. బుధవారం పొన్నారంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 120 రోజుల పంట కాలం కలిగిన తెలంగాణ సోనా, జేజీఎల్ 24423, 28545 వంటి రకాలను సాగు చేయడం ద్వారా డిసెంబరులోనే కోతకు వచ్చి అకాల వర్షాల బారిన పడకుండా ఉంటాయన్నారు. ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలన్నారు. రైతులు మధు, లింగయ్య, బాపు, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సరస్వతిమాత విగ్రహ ప్రతిష్ఠాపన

హాజీపూర్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణమామిడిలోగల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సరస్వతిమాత విగ్రహాన్ని కట్టా అనిత-నరసింహ స్వామి దంపతులు ఏర్పాటు చేయగా బుధవారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ స్వప్న మహేష్, కర్ణమామిడి సింగిల్ విండో చైర్మన్ కోట సత్తయ్య, నాయకులు గడ్డం వెంకటేష్, సాయిని రామ్‌చందర్‌రావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



కోటపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

కోటపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం యూరియా కోసం రైతులు బారులుతీరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేపట్టగా ఉదయం నుంచే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు యూరియా కోసం వచ్చి క్యూలో నిలబడ్డారు. కేవలం 260 యూరియా బస్తాలు మాత్రమే ఉండగా వేలాది మంది రైతులు వచ్చి బారులు తీరడంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో రాపనపల్లి గ్రామానికి చెందిన గుర్రం మల్లయ్య అనే రైతు కింద పడిపోయాడు. ఒక్కొక్కరికి ఒక్కో యూరియా బస్తా పంపిణీ చేశారు. యూరియా కొరతకు కారణం ఎవరని మండలానికి ఎన్ని యూరియా బస్తాలు వచ్చాయి.. ఎంత మందికి ఇచ్చారనే దానిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని బీజేపీ నాయకుడు కందుల వెంకటేష్ డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న కృష్ణాష్టమి వేడుకలు

దండేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వివిధ వేషధారణలతో సందడి చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమలాకర్, ఉపాధ్యాయురాలు స్రవంతి, అంగన్‌వాడీ టీచర్ గోపతి శైలజ, చిన్నారులు పాల్గొన్నారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువత ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకోవాలని, వ్యసనాల బారిన పడొద్దని డీఎం హెచ్‌వో సీతారాం అన్నారు. పట్టణంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో దిశ ఆసిఫాబాద్, మంచిర్యాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, సీపీఎం నీలిమ తదితరులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో మునిగిన లోలెవల్ వంతెన



దహెగాంలో నీట మునిగిన పంటపొలాలు

భారీ వర్షం

ఉప్పొంగి ప్రవహించిన వాగులు, ఒర్రెలు

- గ్రామస్థుల రాకపోకలకు అంతరాయం
- నీటిమునిగిన పంటలు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు
- కుమరం భీం ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తివేత



ఆసిఫాబాద్ మండలంలోని గూడెన్‌ఘాట్ వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 101.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి ఆసిఫాబాద్ మండలంలోని గూడెన్‌ఘాట్ వాగు ఉధృతంగా వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించడంతో సుమారు రెండు గంటలపాటు ఆసిఫాబాద్-చిర్ర కుంట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపో యాయి. వాగు ఉధృతిని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు. కుమరంభీం ప్రాజెక్టులోకి 8,333 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ఐదు గేట్లు పైకి ఎత్తి 21,254 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు కిందికి వదిలారు. దీంతో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలో బుధవారం ఉదయం వరకు అత్యధికంగా రెబ్బె నలో 219.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిర్యాణిలో 179.8, కాగజ్‌నగర్‌లో 133.6, దహె గాంలో 119.2, కౌటాలలో 112.0, ఆసిఫాబాద్‌లో 115.0, కెరమెరిలో 86.8, వాంకిడిలో 80.6, పెంచికల పేటలో 80.0, సిర్పూర్ (టి)లో 74.4, చింతలమానేపల్లిలో 72.2, జైనూరులో 71.8, సిర్పూర్(యూ)లో 61.2, బెజ్జూరులో 58.4, లింగాపూర్‌లో 52.6మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొమ్ముగూడ గ్రామ సమీపంలో వట్టివాగు ప్రజెక్టుకు గండి పడింది.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళ వారం రాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని చికిలి, ఖమాన, తదితర వాగులు పొంగి పారడంతో రాక పోకలు స్తంభించి పోయాయి. మండలంలోని దుబ్బగూడ గ్రామ సమీపంలోని లో లెవెల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో మండల కేంద్రానికి, ఖమాన గ్రామానికి రాక పోకలు స్తంభించాయి.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కురవడంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. లక్మాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహించ డంతో సుమారు పది గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి దిందా వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాబాసాగర్, నాయకపగూడ వాగు, రన్‌వెల్లి-టేకంగూడ ఒర్రెపై ఉన్న లోలెవల్ వంతెనపై నీరు ప్రవహి స్తుండడంతో అతి కష్టం మీద ప్రజలు ఒర్రెను దాటారు.



కుశ్నపల్లి వాగు వద్ద ముళ్ల కంచె వేసిన అధికారులు

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని లో లెవల్ వంతెనలు ఉప్పొంగడంతో రాక పోకలు స్తంభించి పోయాయి. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య రెండు లో లెవల్ వంతెనలపై నుంచి భారీగా వరద నీరు పారు తుండడంతో వాగు అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ రా మ్మోహన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ లోలెవల్ వంతెన వద్ద ముళ్ల కంప వేసి రోడ్డును మూసి వేయించారు. వర్షానికి పంట పొలాల్లోవరద నీరు చేరింది.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మండలంలోని ఒర్రెలు, పెద్దవాగు, ఎర్రవాగులు, పీపీరావు ప్రాజెక్టు మత్తడి ఉధృంగా ప్రవహించింది. ఇట్యాల సమీపంలో కల్వర్టు పై నుంచి, అయిన సమీపంలోని లో లెవల్ వంతెనలు ఉధృంగా వరద నీరు పారడంతో కాగజ్‌నగర్-దహెగాం మధ్య రాక పోకలు నిలిచి పోయాయి. పలువురి ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పెసరికుంట గ్రామాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సందర్శించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగులతో పాటు ఒర్రెలు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చ్చమల్ల వాగు లోలెవల్ వంతెన నుంచి ప్రవహిం చ డంతో రెండు గంటల పాటు రాక పోకలు నిలిచి పోయాయి. పెద్దవాగు వరద ఉధృతితో రహ దారులపై నీరు చేరడంతో కమ్మర్‌గాం, మురళీ గూడ, జిల్లెడ, నందిగామ పరివాహక గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బొక్కివాగు మత్తడి ఉధృతంగా ప్రవహంచడంతో మేరేగూడ గ్రామానికి చెందిన పశువులు, పశువుల కాపర్లు ఇబ్బంది పడుతూ మత్తడి దాటారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి); కిమానాయక్‌తండా వాగు, మోతి పట్టార్‌వాగు, పిట్టాగూడా వాగు, చోర్‌పల్లివాగు, నాగూగుడావాగు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సుమారు మూడు గంటల పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీవో కృష్ణారావు కోరారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం డోర్‌పల్లి వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై కమలాకర్‌పరిశీలించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. పలు కాలనీలో వరద నీరు ఇళ్లలోకి వచ్చింది. పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోందని, ప్రజలు అప్రమత్తండా ఉండాలని అధికారులు కోరారు.



లో లెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న దిందా వాగు



కెరమెరి మండలంలో లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



వాంకిడిలో ఉధృతంగా ప్రవహిస్తున్న చికిలివాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న కాగజ్‌నగర్ పెద్దవాగు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ చర్యలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న నివాసాలలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలిం చాలని తెలిపారు. నదులు, వాగులు ఉధృతంగా ప్రవహించే నేపథ్యంలో ప్రజలు వాటిని దాటే ప్రయత్నం చేయూడదని, పోలీసు శాఖ అధికారులు బందో బస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్లకూడదని చెప్పారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని సూచించారు. చేపల వేటకు ఎవరు కూడా వెళ్లరాదని అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం ఇతర వివరాల కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. జిల్లా ప్రజలు అత్య వసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రంలోని కలెక్ట రేట్‌లో కంట్రోల్ రూం నంబరును 8500844365ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ వివరాలు తెలియజేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఈపీఎఫ్, ఈఎస్ఐ వివరాలు తెలియజేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడేళ్లుగా అప్పటి డీఎంహెచ్‌వో చెన్నకేశవ, సూపరింటెండెంట్‌లను కలిసినప్పటికీ సమస్య పరిష్కరించలేదన్నారు. వెంటనే కార్మికులకు వివరాలు తెలియజేయాలని, కోరారు. కార్యక్రమంలో దివాకర్, చిరంజీవి, మల్లేష్, మురళీ, నవీన్, మమత, గంగన్న, గుణవంత్, సౌజన్య, సోని, షైమద్, జ్ఞానేశ్వర్, కమలాకర్, శ్రీకాంత్, చందు, ఫేహిమ, రూప, విమల, నిరో తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(టి), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు నేరేటి శ్రీధర్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళ వారం రాత్రి మృతి చెందగా బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తదితరులు పరామర్శించారు. శ్రీధర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పిం చారు. చికిత్స పొందుతూ శ్రీధర్ మృతి చెందాడు.

సమస్యలు పరిష్కరించాలి

జైనూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జైనూర్ మార్కెట్ కమిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటి కార్యాలయంలో బుధవారం మార్కెట్ కమిటీ సాధారణ పాలక వర్గ సమావేశం చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పరిధిలో రోడ్లు, గిడ్డంగులకు మరమ్మతు చేపట్టాలని సూచించారు. నిర్మాణ దశలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయం పనులు సత్వరమే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటికి మరింత ఆదాయం సమకూర్చేందుకు అధికారులు పూర్తి స్థాయిలో శ్రద్ధ వహించా లన్నారు. వ్యాపార సముదాయాలకు లైసెన్సులు తప్పని సరిగా ఉండాలని చెప్పారు. లైసెన్సులు లేకుండా పంట ధాన్యాలను కొనుగోలు చేసినట్లయితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్, వైస్ చైర్మన్ జైవంత్‌రావ్, సభ్యులు జాదవ్ జాదవ్ లోకెందర్, మండాడి లింగు, ఆడ రాజకు మార్, రాధాబాయి, పంద్ర షేకు, నీలాబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ ప్రహ్లాద్

సిర్పూర్(యు), అగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ ప్రహ్లాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గల హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ ప్రహ్లాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటశాల, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌ను తనిఖీ చేశారు. వంట సామగ్రిని పరిశీలించారు. కూరగాయలు, కోడిగుడ్లు బాగలేవని సిబ్బంది చెప్పారు. వీటని వాపస్ చేయాలని ఆయనన సూచించారు. నాణ్యత లేని సరుకులు సరాఫరా చేస్తే టెండరుదారుడిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. . హాస్టల్ ఎదుట బురదగా మారడంతో మొరం వేయించేందుకు ఎంపీడీవోతో మాట్లాడి చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ హన్మంత్ రావు, వార్డెన్ భగీరథ, ఏఎన్ఎం వినకరె అమృత, కవిత, పార్వతి, సుమలత, రంభబాయి తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలను నిరోధించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త భారత్ అభియాన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియశీల భాగస్వామి అవుతానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేస్తానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఐలు, ఆర్ఐలు, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని డీఎస్పీ రామానుజం తెలిపారు. బుధవారం నవోదయ విద్యాయంలో నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ యువత బారిన పడకుండా అన్నీ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దన్నారు. చక్కటి లక్ష్యాతో ఉన్నత చదువులు చదువాలన్నారు. యువత చేతిలోనే బంగారు భవిష్యత్తు ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సీఐ ప్రేంకుమార్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాం లక్ష్యంగా మాద్రద్వ్యాల నివారణ కొరకు ప్రతినిత్యం అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. నాషా ముక్త్ భారత్ అభిమాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మోడి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులచే డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, సోదరులకు గంజాయి వాటడం వల్ల కలిగే నష్టాను తెలిపారు. అనంతరం డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం తెలపాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆయన వెంట పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాంకిడి,(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్సై తులసీరాం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద స్థానిక ప్రజలకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై తులసీరాం, ఏఎస్సై పోశెట్టి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం రోజు రోజుకు పెరుగుతుందని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా యువత పెడదారి పడుతున్నారని అది ఒక వ్యసనంగా మారుతుందన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.

అభివృద్ధికి నోచుకోవడం లేదు

కాగజ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా బుధవారం కాగజ్‌నగర్‌కు వచ్చిన సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానికచెక్ పోస్టు నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్, రాజీవ్ గాంధీ చౌరస్తా, మార్కెట్ ఏరియా వరకు సాగింది. కార్యక్రమంలో సిర్పూరు నియోజకవర్గ అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు, పట్టణ అధ్యక్షులు ముస్తాఫీజ్, అర్షద్ హుస్సేన్, మినాజ్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆరవైశ్య భవన్‌లో బుధవారం రాత్రి శివపురాణ కార్యక్రమానికి సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రవచరేతే కిషన్ పెండ్యాల శివపురాణ ఇతిహాసాన్ని వివరించారు. స్థానిక వ్యాపారులు చిలువేరు సత్యనారాయణ, చిలువేరు గంగాధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

దిందా పోడు రైతులకు అండగా ఉంటాం



ప్రజ్ఞాపూర్ వద్ద దిందా పోడు రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

చింతలమానేపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిందా గ్రామానికి చెందిన సుమారు 20 మంది పోడు రైతులు దిందా గ్రామం నుంచి హైదరాబాద్ ప్రగతి భవన్‌కు సుమారు 400 కిలో మీటర్లు పాదయాత్రగా వెళ్తుండగా సిద్దిపేట జిల్లాలోని ప్రజ్ఞాపూర్ వద్ద పాదయాత్రగా వెళ్తున్న చింతలమానేపల్లి మండలం దిందా పోడు రైతులను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 400 కిలో మీటర్లుకు పైగా పాదయాత్ర చేయడానికి సంకల్పించిన దిందా పోడు ఐతుల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. అలాగే బీజేపీ రాష్ట్ర నాయకుడు కొత్తపల్లి శ్రీనివాస్ సైతం పాదయాత్రగా వెళ్తున్న దిందా పోడు రైతులను ములుగు జిల్లాలో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. పోడు రైతులకు న్యాయం చేయాలని కోరారు. కాగా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని హైదరాబాద్‌కు పాదయాత్ర చేస్తున్న దిందా గ్రామస్థులకు గజ్వేల్ నియోజక వర్గం ములుగు ప్రాంతంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా భూమి మాకే ఇవ్వాలని, పోడు పట్టాలిచ్చిన అటవీ అధికారుల అగడాల నుంచి రక్షణ కల్పించాలని, రైతు భరోసా, రైతు బీమా పంట రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొంత దూరం వారితో నడిచి వెళ్లారు.

ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ

కాగజ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించేందుకు జేకే యాజమాన్యం కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎస్పీఎం గేటు ఎదుట బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎంలో కార్మికులను యాజమాన్యం అణగదొక్కుతుందన్నారు. కార్మిక చట్టాలు వర్తించడం లేదన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మిల్లు జనరల్ మేనేజర్ గిరికి అందజేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు కల్లూరి శ్రీనివాస్, గోగర్ల రాములు, శ్యాంరావు, చిట్టవేణి రాజేష్, బండి శ్రీనివాస్, జాడి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.